

వ్యాసెక్టమీ శస్త్రచికిత్సల పక్షోత్సవం

సుభాష్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆసుపత్రితో పాటు హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి, జమ్మికుంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో డిసెంబరు 4 వరకు వ్యాసెక్టమీ అవగాహన, శస్త్ర చికిత్సల పక్షోత్సవం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21న ప్రారంభించిందన్నారు. పురుషులకు కోత, కుట్టులేని కుటుంబ నియంత్రణ (వ్యాసక్టమి) ఆపరేషన్ చాలా సురక్షితమైందని కుటుంబ నియంత్రణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సనజవేరియా తెలిపారు.

నామినేషన్ల పర్వం షురూ



- తొలిరోజు సర్పంచ్ పదవులకు 92 నామినేషన్లు
- వార్డు సభ్యులకు 86 దాఖలు
- డిసెంబరు 11న మొదటి విడత ఎన్నికలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఒక వైపు బీసీలకు రిజర్వేషన్లలో అన్యాయం జరిగిందంటూ ఆయా వర్గాలకు చెందినవారు హైకోర్టు మెట్లు ఎక్కగా మరోవైపు పంచాయతీ ఎన్నికల పర్వంలో గురువారం నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ మేరకు గ్రామపంచాయతీల్లో ఎన్నికల నోటీసులు, ఓటరు లిస్టులను ప్రదర్శించారు. మొదటి విడత నామినేషన్లు వేసేందుకు ఈ నెల 29వరకు గడువు ఉండగా తొలిరోజు గురువారం సందడిగా నామినేషన్ల స్వీకరణ సాగింది. గ్రామాలలో పంచాయతీ ఎన్నికల హడావుడి కనిపించింది. సర్పంచు పదవులకు, వార్డుసభ్యుల పదవులకు పోటీ చేసే వారు తమ మద్ధతుదారులతో కలిసి వచ్చి ఆయా కేంద్రాలలో నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు.

రేపటి వరకు నామినేషన్లకు గడువు

జిల్లాలోని చొప్పదండి, గంగాధర, రామడుగు, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాలలోని 92 పంచాయతీలకు చెందిన 92 సర్పంచు పదవులు, 866 వార్డు సభ్యుల పదవుల కోసం మొదటి విడతలో డిసెంబరు 11న ఎన్నికలు జరుగనున్నాయి. నామినేషన్లు వేసేందుకు మూడు రోజులు గడువు ఇవ్వగా తొలిరోజే 92 సర్పంచు పదవులకు 92 నామినేషన్లు, 866 వార్డు సభ్యుల పదవులకు 86 నామినేషన్లు వచ్చాయి. చొప్పదండి మండలం లో 16 గ్రామపంచాయతీలలో 15 మంది సర్పంచు పదవుల కోసం నామినేషన్లు దాఖలు చేశారు. గంగాధర మండలంలో 33 పంచాయతీలు ఉండగా 28 నామినేషన్లు, రామడుగులోని 23 పంచాయతీల్లో 27 నామినేషన్లు, కరీంనగర్ రూరల్ మండలంలోని 14 పంచాయతీల్లో 10 నామినేషన్లు, కొత్తపల్లి మండలంలో 6 పంచాయతీల్లో సర్పంచు పదవులకు 12 నామినేషన్లు దాఖలయ్యాయి.

చొప్పదండి మండలంలో 12 వార్డు సభ్యుల నామినేషన్లు, రామడుగు మండలంలో 12 వార్డుసభ్యుల నామినేషన్లు, కొత్తపల్లి మండలంలో 21 వార్డు సభ్యుల నామినేషన్లు, కరీంనగర్ రూరల్ మండలంలో 9 వార్డు సభ్యుల నామినేషన్లు, గంగాధర మండలంలో 32 వార్డు సభ్యుల నామినేషన్లు వచ్చాయి. శుక్ర, శనివారాల్లో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నెల 30న నామినేషన్ల పరిశీలన జరుగనున్నది. అదే రోజు సాయంత్రం చెల్లుబాటు అయిన అభ్యర్థుల నామినేషన్ల వివరాలను ప్రకటిస్తారు. వచ్చిన నామినేషన్లపై ఏవైనా ఫిర్యాదులుంటే అప్పీళ్లకు డిసెంబరు 1న వీలుకలిగించారు. ఆ రోజు సాయంత్రం 5 గంటల వరకు కూడా అప్పీలు చేసుకునే అవకాశముంటుంది. డిసెంబరు 2న సాయంత్రం 5 గంటల వరకు అప్పీళ్లను పరిష్కరిస్తారు. డిసెంబరు 3న అభ్యర్థిత్వాలను ఉపసంహరించుకునే వారికి మధ్యాహ్నం 3 గంటల

మిగతా 8వ పేజీలో..

నామినేషన్ల సరళిని పరిశీలించిన కలెక్టర్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలాసత్పతి రామడుగు మండలంలోని వెదిర గ్రామపంచాయతీ కార్యాలయంలో వెదిర, వెలిచాల గ్రామాల్లో నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. నామినేషన్లు వేసేందుకు వచ్చే వారికి హెల్ప్‌డెస్క్ ద్వారా సహకరించాలని, పోలీసు బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు జరుగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ దరఖాస్తు ఫారాలను తీసుకున్న వివరాలను రిజిస్టర్లలో నమోదు చేసి నామినేషన్ల దాఖలైన వివరాలను జిల్లా కేంద్రా నికి సకాలంలో పంపించాలని కోరారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.



వెదిరలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

స్థానిక ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

- పాత నేరస్థుల బైండోవర్
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సీపీ



పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందికి, అధికారులకు ఆదేశాలిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు దశల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటి విడతలో చొప్పదండి, రామడుగు, గంగాధర, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు నామినేషన్ల స్వీకరణ జరుగుతోంది. దీని కోసం జిల్లావ్యాప్తంగా 33 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటి వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో పలు చోట్ల భద్రతా ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం గురువారం పర్య వేక్షించారు. పలు గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను స్థానిక పోలీసు అధికారులతో కలిసి సీపీ సందర్శించారు. ఇందులో భాగంగా, గతంలో నేర చరిత్ర ఉన్న ఎన్నికల నేరస్థులను స్థానిక తహసీల్దార్‌ల ఎదుట హాజరు పరచి మళ్లీ ఎలాంటి నేర ఘటనల్లో పాల్గొనకుండా లక్ష రూపాయల స్వంత పూచీకత్తుపై బైండోవర్ చేస్తున్నారు. కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ఎస్సైలు రామడుగు (రాజు), గంగాధర(వంశీకృష్ణ), చొప్పదండి (నరేష్‌రెడ్డి), ఇతర అధికారులు పాల్గొన్నారు.

శిశు మరణాలను అరికట్టాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ



సమావేశమైన డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, అధికారులు

సుభాష్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శిశు మరణాలను సింగిల్ డిజిట్‌కు తగ్గించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. గురువారం జిల్లా జనరల్ ఆసుపత్రిలో సూపరింటెండెంట్, వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్, పీడియాట్రిక్ హెచ్‌ఓడీ వైద్యులతో కలిసి డీఎంహెచ్‌వో సంకల్ప్ జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శిశు మరణా లను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలు, విధి విధానాల గురించి చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ వీరారెడ్డి, వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణప్రసాద్, పీడియాట్రిక్ హెచ్‌ఓడీ వైద్యులు, డీపీవో స్వామి పాల్గొన్నారు.

ఇల్లందకుంటలో వైన్‌షాపులు తొలగించాలి



ఎక్సైజ్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆలయ చైర్మన్ రామారావు

ఇల్లందకుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండల కేంద్రంలోని సీతారామ చంద్రస్వామి ఆలయ పరిధిలో ఉన్న వైన్‌షాపులను తొలగించాలని ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు గురువారం జిల్లా అబ్కారి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. వైన్ షాపుల కారణంగా దర్శనానికి వచ్చే భక్తులకు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్తగా వచ్చే వైన్‌షాపులను ఆలయ ప్రాంగణానికి దూరంగా ఏర్పాటు చేయాలన్నారు. వందల ఏళ్ల చరిత ఉన్నటువంటి ఆలయ ప్రాముఖ్యతను చాటే విధంగా ఉండాలని, మద్యం షాపులను ఆలయ పరిసర ప్రాంతాలకు దూరంగా ఏర్పాటు చేసేందుకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. దేవస్థానానికి వంద మీటర్ల దూరం ఉండాలనే నిబంధన తుంగలో తొక్కుతున్న వ్యాపారస్థులపై చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఇతర ఆలయాలకు ఉండే నిబంధన ఇక్కడ వర్తింపజేయాలని కోరారు.

హుజూరాబాద్ పట్టణాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్



చెరువు వద్ద పనులను పరిశీలిస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. గురువారం హుజూరాబాద్ పట్టణంలోని మోడల్ చెరువు సుందరీకరణలో భాగంగా నిర్మిస్తున్న చిల్డ్రన్ పార్క్, వాకింగ్ ట్రాక్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ విశాలమైన మోడల్ చెరువు ఇన్ని రోజులు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గొప్పగా పరిపాలించామని చెప్పిన నాయకులు ఎందుకు నిర్లక్ష్యం వహించారో వారికే తెలవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హుజూరాబాద్ పట్టణాభివృద్ధికి రూ.15కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. అందులో భాగంగా పిల్లలు ఆడుకోవడానికి, ఆహ్లాదానికి నిధులు కేటాయించామన్నారు. మోడల్ చెరువుతో పాటు గంగోనికుంటను కూడా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడలు

ప్రారంభించిన కలెక్టర్ పమేలాసత్పతి





చెస్ పోటీల్లో తలపడుతున్న దివ్యాంగులు, బాల్య వివాహ ముక్త్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లలు, వికలాంగుల వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల జిల్లా స్థాయి క్రీడా పోటీలు గురువారం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల మానసిక వికాసానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. చెస్, క్యారం, రన్నింగ్, షార్ట్ పుట్, జావెలిన్ త్రో, తదితర పోటీలను నిర్వహించి దివ్యాంగులు ప్రతిభచాటారు. అనంతరం గెలుపొందిన వారికి కలెక్టర్ మెడల్స్ అందజేశారు. బాల్య వివాహ ముక్త్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి, జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, యువ కేంద్ర కో-ఆర్డినేటర్ రాంబాబు, శివకాంత్, పెండ్యాల కేశవరెడ్డి, వెన్నం శ్రీనివాస్, మొగిలి లక్ష్మణ్, కె నర్సయ్య, వై సురేష్, రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గణేశ్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్, ఏడీఈ పంజాల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు: ఎస్‌ఈ ఆఫీస్ కాంపౌండ్ ఏరియా, కోర్టు చౌరస్తా, ఐబి గెస్ట్ హౌస్, సర్కస్ గ్రౌండ్, రెడ్డి గారి వంటిల్లు ప్రాంతం, చైన్నై షాపింగ్ మాల్ ప్రాంతం, జానకి చికెన్ సెంటర్ ప్రాంతం, రామాలయం ప్రాంతం,ప్రశాంత్‌నగర్ ప్రాంతం, రేనే హాస్పిటల్, కోర్టు, వాటర్ ట్యాంక్ ప్రాంతం, వావిలాలపల్లి ఏరియా, వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మంచినీటి సరఫరాకు అంతరాయం

కరీంనగర్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పద్మనగర్‌లో హైలెవల్ పంపింగ్ మెయిన్ పైపులైన్ లీకేజీ మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ ఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. హైలెవల్ జోన్ పరిధిలోని 14,15,16,35,36,38,54,55,56 డివిజన్లకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని, ఆయా డివిజన్ల ప్రజలు మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

వీధిదీపాల నిర్వహణ మెరుగుపరచాలి

- డీఈ, ఏఈలు పర్యవేక్షించాలి
- మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్



కరీంనగర్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో వీధిదీపాల నిర్వహణ మరింత మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. గురువారం నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ అధికారులతో వీధి దీపాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. వీధి దీపాల నిర్వహణలో తలెత్తుతున్న సమస్యలు, మున్సిపల్ విద్యుత్ మీటర్ల పనితీరు, వాటి చార్జీలు, బిల్లుల చెల్లింపులు, ఆటోమెటిక్ ఆన్ ఆఫ్ బటన్స్ పనితీరు తదితర అంశాలపై డీఈ, ఏఈలతో చర్చించారు.

నగరమంతటా వీధిదీపాలు సక్రమంగా వెలిగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని, ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అన్నారు. వెలుగని లైట్లను మరమ్మతు చేసి వెలిగేలా చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టర్ నుంచి రావలసిన మెటీరియల్స్‌ను త్వరగా తెప్పిం చాలని ఆదేశించారు. అవసరమైన చోట కొత్తగా లైట్లు వేయాలని, ఇంకా ఏమైనా మెటీరియల్ అవసరమైతే వెంటనే వాటికి టెండర్లు పిలవాలని సూచించారు. వీధి దీపాల నిర్వహణ ఏఈ, డీఈలు రాత్రివేళల్లో అన్ని లైట్లు వెలుగుతున్నాయా లేదా పర్యవేక్షణ చేయాలన్నారు. వచ్చే శుక్రవారంలోగా సర్వే పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని అన్నారు. నగరంతో పాటు విలీన డివిజన్లలో కూడా ఆటోమెటిక్ ఆన్ ఆఫ్ నిర్వహణ సమయం ప్రకారంగా సక్రమంగా జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని, వినియోగంలో లేని విద్యుత్ మీటర్లను గుర్తించి వినియోగంలోకి తీసుకు రావాలని అన్నారు. వీధి దీపాలకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించాలని, ఎక్కడా లైట్లు వెలుగడం లేదనే ఫిర్యాదులు రాకుండా చూసు కోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈలు సంజీవ్ కుమార్, శివానందం, డీఈలు లచ్చి రెడ్డి, దేవేందర్, అరుణ్, ఓంప్రకాశ్, వెంకటేశ్వర్లు, అయూబ్‌ఖాన్, ఏఈలు పాల్గొన్నారు.

భవన నిబంధనలను విధిగా పాటించాలి

నగరంలోని భవన యజమానులు విధిగా నిబంధనలను పాటించాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ అన్నారు. గురువారం నగరంలోని మంకమ్మతోట, జ్యోతినగర్, క్రిస్టియన్ కాలనీలో మున్సిపల్ అధికారులతో కలిసి కమిషనర్ 22 వాణిజ్య సెల్లార్లను తనిఖీ చేశారు. పార్కింగ్ కోసం కేటాయించిన ప్రాంతాలను వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుతున్నట్లు గుర్తించారు. నిబంధనలను ఉల్లంఘించిన 13 మంది భవన యజమానులకు నోటీసులు జారీ చేశారు. పార్కింగ్ కోసం సెల్లార్ స్థలాలను వెంటనే పునరుద్ధరించాలని కమిషనర్ ఆదేశించారు. నిబంధనలు పాటించని భవనయజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముఖ్యమంత్రిని కలిసిన రామగుండం ఎమ్మెల్యే


సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో రామగుండం జెన్‌కో స్థానంలో 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఆమోద ముద్ర వేయడంతో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రామగుండం నియోజకవర్గానికి కోట్లరూపాయల నిధులను తీసుకువస్తూ అభివృద్ధి చేస్తున్నామన్నారు. రామగుండం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 800 మెగావాట్ల విద్యుత్‌ప్లాంట్‌ను నిర్మించాలని మంత్రివర్గం ఆమోద ముద్ర వేసిందన్నారు. దీనికోసం ముఖ్యమంత్రి, మంత్రులను కలిశానన్నారు. నేడు రామగుండం ప్రజల కలసాకారం అయ్యిందన్నారు. 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ వస్తే నిరుద్యోగులకు ఉద్యోగఅవకాశాలు రావడంతో పాటు రామగుండం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

రూ.7,250 పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర 7,250 రూపాయలు పలికింది. మార్కెట్ యార్డుకు బుధవారం 56 మంది రైతులు 462 క్వింటాళ్ల విడి పత్తి ఎనిమిది మంది రైతులు 11 క్వింటాళ్లు విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర 7250 రూపాయలు, కనిష్ఠ ధర 5,700 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

పురుగుల మందు తాగిన యువకుడి మృతి


గణేష్ (ఫైల్)

ఓదెల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన చెరుకు గణేష్ (24) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. స్థానికుల సమాచారం ప్రకారం.. గణేష్ చదువును మానేసి స్వగ్రామం ఓదెలలోనే ఉంటున్నాడు. గత శుక్రవారం తన ఇంటిలోనే పురుగుల మందు తాగాడు. స్నేహితులు యువకుడి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే అతడిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. యువకుడి ఆరోగ్యపరిస్థితి విషమించడంతో అక్కడినుంచి హైదరాబాద్‌కి తరలించారు. చికిత్సపొందుతూ గురువారం అక్కడ మృతిచెందాడు. ఆత్మహత్య చేసుకోవడానికి కారణం ప్రేమవ్యవహారంగా తెలుస్తోంది. ఇదే విషయాన్ని ఆత్మహత్యకు ముందు ఒక పేపర్‌పై రాసి పురుగుల మందు తాగినట్లు సమాచారం. ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు రాలేదని పొత్కపల్లి ఎస్‌ఐ తెలిపారు.



రాజన్న సన్నిధిలోని శిలా శాసనం, భీమన్న ఆలయంలో విగ్రహాలు

ప్రాచీన శిలా శాసనాలకు భద్రతేది?

పురావస్తు మ్యూజియం ఏర్పాటుకు ఎదురుచూపులు

వేములవాడ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ దేవస్థానంలో ఉన్న ప్రాచీన శిలా శాసనాలకు భద్రత కరువైంది. దాదాపు 1300 సంవత్సరాల క్రితం అప్పటి పాలకులైన చాళుక్యులు, కల్యాణీ చాళుక్యుల కాలంలో ఆరుకు పైగా శిలా శాసనాలు, జైన, బౌద్ధ, చౌముఖులు, నాగముచులింగ విగ్రహాలు నెలకొల్పారు. వీటితో పాటు వినియోగంలో లేని లింగాలు, వీరభద్రదేవి విగ్రహాలు భీమన్న సన్నిధిలో ఉన్నాయి. వీటి వల్ల వేములవాడ చారిత్రక ప్రాశస్త్యం తెలుసుకునే వీలుంది. ఇవేకాకుండా వందల ఏళ్ల నాటి ప్రాచీన తాళపత్ర గ్రంథాలు, పుస్తకాలు, ఫోటోలు ఉన్నాయి. అలాగే పురాతన కాలంనాటి ద్వాదశ జ్యోతిర్లింగాలు, పంచాయతనాలు, అద్దాల మండపంలోని శిల్పాలు, స్తంభాలు ఉన్నాయి. వీటన్నింటికీ భద్రత కరువైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఈ ప్రాచీన శిలా శాసనాలు, విగ్రహాలను పురవాస్తు శాఖ అధికారులు పరిశీలించి మ్యూజియంలో భద్రపరుస్తామని చెప్పారు. కానీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా పురావస్తు మ్యూజియం ఏర్పాటు చేసి శిలా శాసనాలను భద్రపర్చాల్సిన అవసరం ఉంది.

విస్తరణలో భాగంగా మ్యూజియం నిర్మించాలి..
నాగేంద్రశర్మ, చరిత్రకారుడు

రాజన్న సన్నిధిని విస్తరిస్తున్న క్రమంలో శిలా శాసనాలు భద్రంగా ఉండడానికి అవసరమైన మ్యూజియం ఏర్పాటు చేయాలి. ఈ విషయమై ఈవో రమాదేవి, విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి విన్నవించాను. ఇప్పటికైనా పురవాస్తు శాఖకు దేవస్థానం లేఖ రాసి తగిన ఏర్పాట్లు చేయాలి.

శిలా శాసనాలను పదిలంగా భద్రపరిచాం..
ఎల్. రమాదేవి, రాజన్న ఆలయ ఈవో

రాజన్న, భీమన్న ఆలయాల్లో ఉన్న పురాతన శిలా శాసనాలను, విగ్రహాలను పదిలంగా భద్రపరిచాం. ఈ విషయమై పురావస్తు శాఖకు లేఖ రాస్తాం. తప్పకుండా శిలా శాసనాలకు మ్యూజియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.



నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- వేగవంతం చేయాలని రైతుల డిమాండ్


కొనుగోలు కేంద్రంలోని ధాన్యం

ఇల్లంతకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతోంది. మండలంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో 24కేంద్రాలు, ఇల్లంతకుంట, గాలిపెల్లి సహకార సంఘాల ఆధ్వర్యంలో 4 కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసినా రైస్‌మిల్లులను అలాట్ చేయడం కొంత ఆలస్యం కావడంతో వల్ల ధాన్యం సేకరణ ఆలస్యం అవుతోంది. కేంద్రాల్లో ధాన్యాన్ని పోసి పక్షం రోజులు గడిచిపోతున్నా తూకం వేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కేంద్రాల నిర్వాహకులు మాత్రం తేమశాతం రాకపోవడం వల్లనే ఆలస్యం అవుతోందని పేర్కొంటున్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలలో దాన్యం సేకరణ వేగవంతం చేయాలని కోరుతున్నారు.

కేంద్రాల్లోనే ధాన్యం కుప్పలు..
అన్నదాతకు తిప్పలు..

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట): వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. విక్రయించేందుకు అన్నదాతలు తరలించి నెలరోజులవుతున్నా సకాలంలో తూకం వేయకపోవడంతో పడిగాపులు కాయాల్సిన వస్తోంది. ఓవైపు సాగు పనులు.. మరోవైపు పండించిన ధాన్యం అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. లారీల కొరత, తూకం వేయడంలో జాప్యం వల్ల కేంద్రాల్లోనే వేచి ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.


వీర్నపల్లిలోని కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

పిచ్చి కుక్క స్వైరవిహారం

- ఐదుగురికి గాయాలు

పెగడపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గురువారం ఉదయం పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. మోడల్ స్కూల్ పరిసరాల్లో ఐదుగురిని కరిచి తీవ్రంగా గాయపరచగా ఇద్దరు జగిత్యాల ఆస్పత్రిలో చేరారు. గ్రామానికి చెందిన మల్యాల సత్యమ్మ, పెంజర్ల శ్రీనివాస్, కొత్తూరి సాయిలు, వడ్లూరి రాజవ్వ, రంగారావులను కరువగా తీవ్రగాయాలైన మల్యాల సత్యమ్మ, పెంజర్ల శ్రీనివాస్‌లను చికిత్స నిమిత్తం జగిత్యాల ఆస్పత్రిలో చేర్పించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

జగిత్యాలరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండ్లపల్లి గ్రామానికి చెందిన బాలె మల్లీశ్వరి (38) అనే వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం మల్లీశ్వరి కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. దీంతో మనస్తాపం చెందిన మల్లీశ్వరి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త బాలె గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

ఇసుకను తరలిస్తున్న ఆరు టిప్పర్ల పట్టివేత

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని ఆరెపల్లి శివారులో బుధవారం అర్ధరాత్రి ఆరు ఇసుక టిప్పర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణాపై పక్కా సమాచారం మేరకు ధర్మపురి తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది నిఘా వేసి ఆరు టిప్పర్లను పట్టుకున్నారు. అనంతరం ఐదు ఇసుక టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు, ఒక ఇసుక టిప్పర్‌ను మండల రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన ఇసుక విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆర్‌ఐ భాస్కర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి.మహేష్ తెలిపారు.

● **పోలీసుల కళ్లు గప్పి ఇసుక తరలింపు**

ధర్మపురి మండలంలోని ఆరెపల్లి, ధర్మపురి గోదావరి నది నుంచి కొంతకాలంగా అక్రమార్కులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. అనంతరం జగిత్యాల, ధర్మపురి, రాయపట్నం ప్రధాన రహదారుల గుండా కొందరు వ్యక్తులు ఇతర ప్రాంతాలకు తరలిస్తూ రోజుకు లక్షలు రూపాయలు సంపాదిస్తున్నారు. ఈ ఇసుక అక్రమ రవాణా విషయమై పోలీసులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వివిపిస్తున్నాయి.


రెవెన్యూ అధికారులు పట్టుకున్న ఇసుక టిప్పర్లు

ఇసుక డంప్‌ల స్వాధీనం..

కథలాపూర్ (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని బొమ్మెన, గంభీర్‌పూర్, తక్కళ్ళపల్లి గ్రామాల రోడ్ల వెంట నిల్వ ఉంచిన ఇసుక డంపులను పట్టుకున్నామని ఆర్‌ఐ రవీందర్ తెలిపారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన సమాచారం మేరకు ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బందితో కలిసి దాడులు చేశామని పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కార్ఖానగడ్డ ప్రాంతంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎండీ అమీర్‌ఖాన్(18) ఆసుపత్రిలో చికిత్సపొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. హుస్సేనిపురకు చెందిన అమీర్‌ఖాన్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి ఎనిమిది గంటలకు పనిముగించుకొని ఇంటికి వెళ్తున్నాడు.

గాంధీ చౌరస్తా నుంచి నాకా చౌరస్తా దారిలో బైక్‌ను వెనుకవైపు నుంచి గుర్తుతెలియని వ్యాన్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అమీర్‌ఖాన్‌ను కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేయిస్తుండగా అర్ధరాత్రి సమయంలో మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టివేత


పట్టుబడిన మద్యాన్ని చూపిస్తున్న శంకరపట్నం ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్‌లో అక్రమంగా నిలువ ఉంచిన రూ.15 వేల మద్యం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా అక్రమ మద్యం నిలువ, రవాణాపై నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. గురువారం అందిన సమాచారంతో దుర్శేడ్ గ్రామంలో ఊర్మిళ నివాసంలో తనిఖీ చేయగా మద్యం పట్టుకున్నట్లు, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలం కన్నాపూర్, లింగాపూర్‌లో కేశవపట్నం ఎస్సై శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గురువారం బెల్ట్ షాపులపై దాడి చేశారు. అక్రమంగా నిలువ చేసిన మద్యాన్ని పట్టుకున్నారు. ఎస్సై వివరాల ప్రకారం.. కన్నాపూర్ గ్రామానికి చెందిన పంజాల రమేష్, పంజాల సత్యనారాయణ, లింగాపూర్‌కు చెందిన పచ్చిమట్ల నారాయణ నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై దాడి చేసినట్లు, వారి వద్ద నుంచి సుమారు 21,000 రూపాయల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వీణవంక: వీణవంక మండలం రెడ్డిపల్లిలో సుమన్ బెల్ట్ షాప్‌పై పోలీసులు దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 8,760 రూపాయల విలువ గల మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

చందుర్తి: రెండు గ్రామాల్లో అక్రమంగా నిల్వ చేసిన రూ.12,395 విలువగల మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై ఆనంద్ గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని జోగాపూర్ కిష్టంపేట గ్రామాల్లోని రెండు ఇళ్లలో అక్రమంగా మద్యాన్ని నిల్వచేసినట్లు సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో జోగాపూర్‌లో గడ్డం అంజయ్య ఇంట్లో 6,725 రూపాయల విలువగల మద్యాన్ని, కిష్టంపేటలో వాంకే అనిత ఇంట్లో 5,670 రూపాయల విలువగల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గడ్డం అంజయ్యతో పాటు వాంకే అనితపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 9న ఆదిలాబాద్‌కు చెందిన సిద్ధార్థ పవర్ తన సెల్‌ఫోన్‌ను కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో పోగొట్టుకొని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్ మహబూబాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సెల్ యజమానిని గురువారం కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్‌కు పిలిపించిన సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను అందజేశారు. ఫోన్ రికవరీకి కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను అభినందించారు.

వృద్ధురాలి అదృశ్యం

మల్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నూకపల్లి అర్బన్‌హౌజింగ్ కాలనీకి చెందిన తునికి ప్రమీళ అనే వృద్ధురాలు బుధవారం నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ప్రమీళ ఇంటికి తిరిగి రాలేదని పలు చోట్ల వెదికిన ఆచూకీ లభించలేదని పేర్కొనగా వృద్ధురాలి కొడుకు నరేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని యువకుడి మృతి

ఓదెల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓదెల-కొలనూర్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాల పక్కన గురువారం గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి మృతిచెందాడు. మృతిచెందిన వ్యక్తి వయసు 30-35 మధ్య ఉంటుందని, గుర్తుతెలియని ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి పడి మృతి చెంది ఉంటాడని రైల్వే అధికారులు భావిస్తున్నారు. మృతుడు బ్లూ ఫుల్ టీషర్టు, దానిపై తెలుపు డిజైన్, స్కై బ్లూకలర్ లోయర్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి తిరుమల తిరుపతి వెళ్లే టిక్కెట్ లభించింది. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు, వస్తువులు లేవు. మృతదేహాన్ని రామగుండంలోని జనరల్ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు, కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. వివరాలు తెలిస్తే 9949304575 నంబర్‌కు తెలపాలని కోరారు.

28 మంది బైండోవర్

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపుల నిర్వాహకులు, పాత నేరస్థులు 13 మందితోపాటు సస్పెక్ట్ షీటర్స్, కమ్యూనల్ షీటర్స్ 15 మందిని గురువారం బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలులో భాగంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 28 మందిని స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరు పరచినట్లు, నేర ఘటనలు, అక్రమ దందాలకు పాల్పడకుండా లక్ష రూపాయల సొంత పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు వివరించారు. బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ సాఫీగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా గురువారం కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్, మొగ్ధుంపూర్, చామనపల్లి, చెర్లబూత్కూర్, చేగుర్తిలోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు.

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని బెల్ట్‌షాపు నిర్వాహకులు, రాజకీయ పార్టీల నాయకులను తహసీల్దార్ ముక్తర్‌పాషా ఎదుట హాజరుపరిచామని పోలీసులు గురువారం తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేశామని పేర్కొన్నారు. మద్యం అనుబంధ దుకాణాల నిర్వాహకులు, రాజకీయ పార్టీల నాయకులు క్రమశిక్షణతో నడచుకోవాలని సూచించారు.

మాజీ మంత్రి హరీష్‌రావు దిష్టిబొమ్మ దహనం


హరీష్‌రావు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఏర్పాటు చేయనున్న 800మెగావాట్ల థర్మల్ విద్యుత్‌ప్లాంట్‌పై మాజీమంత్రి హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గోదావరిఖని చౌరస్తా లో కాంగ్రెస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మహంకాళిస్వామి, గట్ల రమేష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో రామగుండానికి ఒక్క ప్రాజెక్టును కూడా తీసుకురాకపోగా అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. జెన్‌కో స్థానంలో 800 మెగావాట్ల విద్యుత్‌ప్లాంట్‌ను ఏర్పాటుతో ఇక్కడ నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని అన్నారు. కానీ ఎన్‌టీపీసీ, జెన్‌కో బిడ్డింగ్‌పై హరీష్‌రావు అవగాహన లేకుండా మాట్లాడడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బొంతల రాజేష్, తిప్పారపు శ్రీనివాస్, దీటి బాలరాజు, బొమ్మక రాజేష్, కొప్పుల శంకర్, కౌటం సతీష్, గడ్డం శ్రీనివాస్, పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయండి


నాయకులతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

సిరిసిల్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించే దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలని ప్రణాళిక సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం నవంబరు 29న దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించడానికి అంబేద్కర్ చౌక్ వద్ద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో కేసీఆర్ నిరాహార దీక్ష ముఖ్య ఘట్టమని అన్నారు. కార్యక్రమంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, టెక్స్‌టైల్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ అరుణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య పాల్గొన్నారు.

విద్యుత్ అవసరాలకు ఇండోర్ సబ్‌స్టేషన్

● నిరంతర సరఫరాకు ముందస్తు ప్రణాళికలు
● రూ.4.5 కోట్లతో కరీంనగర్‌లో ఏర్పాటు

గణేశ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ విద్యుత్ అవసరాలను తీర్చడానికి టీజీ ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ఇండోర్ సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. కరీంనగర్ మహాత్మా జ్యోతిబాపులే పార్కులో ఈ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు.వేసవి కాలంలో ఓవర్‌లోడ్, ఇతర విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ఈ సబ్‌స్టేషన్ ఉపయోగపడుతుంది.

నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా కోసం..
మేక రమేష్‌బాబు, టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ



భవిష్యత్తులో విద్యుత్ వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఇండోర్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నాం. అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకున్నాం. 12 అడుగుల ప్రహరీ నిర్మిస్తున్నాం.. ఈ సబ్‌స్టేషన్‌తో పలు ప్రాంతాలకు లోవోల్టేజీ సమస్యలు తీరుతాయి.

ప్రయోజనాలు

ఇండోర్ సబ్ స్టేషన్‌ను నాలుగు గుంటల స్థలంలో నిర్మించవచ్చు. సంప్రదాయ అవుట్ డోర్ సబ్ స్టేషన్ సుమారు 20 గుంటల నుంచి ఎకరం వరకు స్థలం అవసరం ఉంటుంది. ఇండోర్ సబ్‌స్టేషన్‌తో లో వోల్టేజీ సమస్యలను తగ్గించవచ్చు. లైన్ పొడవు తక్కువ ఉండడం వల్ల విద్యుత్ అంతరాయాలను నివారించవచ్చు. కరీంనగర్ మహాత్మా జ్యోతిబాపులే పార్కులో ఏర్పాటు చేస్తున్న ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో ముకరంపుర, బస్టాండ్, గీతాభవన్, ఐబీ చౌరస్తా, జ్యోతినగర్, సంతోష్‌నగర్ ప్రాంతాలు వస్తాయి. ఈ ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు ఎక్కువగా ఉన్నాయి. సుమారు 15 మెగావాట్ల లోడ్ అవసరం అవుతుంది. భవిష్యత్తులో విద్యుత్ ఉపకరణాల వినియోగం పెరిగేకొద్దీ లోడ్ పెరుగుతుంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంతంలో సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుని ఇండోర్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో మొట్టమొదటి సారి కరీంనగర్‌లో ఏర్పాటు చేస్తున్నారు.


కరీంనగర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే పార్కులో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్

మల్లెగుట్ట మల్లన్నకు నాగవెల్లి పట్నం


మల్యాల నుంచి బోనాలతో వెళ్తున్న భక్తులు

మల్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల శివారులో గల మల్లెగుట్ట మల్లన్న సన్నిధి షష్టి దండి వారం సందర్భంగా సందడిగా మారింది. బుధవారం రాత్రి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు గుట్టపైకి చేరుకోగా ఒగ్గు పూజారులు మల్లన్నకు కల్యాణం నిర్వహించారు. కాగా గురువారం భక్తులు బోనాలతో వెళ్లి స్వామి వారకి సమర్పించగా నాగవెల్లి పట్నం వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. దండి ఏడు వారాల పాటు ఇక్కడ పూజలు జరగనుండగా వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకోనున్నారు.

దత్తాత్రేయ నవరాత్రోత్సవాలు ప్రారంభం


అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దత్తాత్రేయస్వామి నవరాత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్థానిక లక్ష్మీనరసింహస్వామి అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయం పక్కనే గల దత్తాత్రేయస్వామి ఆలయంలో, గోదావరి నదీ తీరాన గల దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో స్వామి వారలను అందంగా పూలతో అలకంరణ చేసారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఆలయ వంశపారంపర్య అర్చకులు ద్యారం గిరిప్రసాద్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు స్వామి వారలకు కలశ పూజ, రుద్రాభిషేకం, పురుషసూక్తం, లక్ష్మీసూక్తంతో అభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తల మండలి సభ్యులు ఒజ్జల సౌజన్య-నరేందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సమ్మేళనానికి నర్సింహులపల్లి విద్యార్థులు

ధర్మారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) వారు నిర్వహించే అంతర్జాతీయ శతాధిక బాలరచయితల సమ్మేళనానికి పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నర్సింహులపల్లి జిల్లాపరిషత్ విద్యార్థులు ఎంపికయ్యారు. నవంబరు 30న, తానా ప్రపంచ సాహిత్యవేదిక ఆధ్వర్యంలో 13గంటల పాటు నిర్విరామంగా బాలసాహిత్య భేరి కార్యక్రమం నిర్వహిస్తారు. కథ, గేయం, వచన కవిత, పద్యం విభాగాల్లో పోటీలు జరుగుతుండగా ప్రపంచ వ్యాప్తంగా 101మంది విద్యార్థులు పాల్గొంటారు. ఇందులో నర్సింహులపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గంగారపు శృతి, దారవేణి అశిత, అలిశెట్టి రాహుల్, సింగం శశాంత్, గన్మకుల లవన్‌కుమార్ కథ, వచనకథ విభాగాల్లో జూమ్ వేదిక ద్వారా పాల్గొననున్నారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు నరేందర్, ఆంజనేయులు, పుష్పలత, శ్రీనివాస చక్రవర్తి రామచంద్రారెడ్డి, కందుకూరి భాస్కర్ అభినందించారు.


అంతర్జాతీయ కథల సమ్మేళనానికి ఎంపికైన విద్యార్థులు


యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నమూనా

ఎడ్యుకేషనల్ హబ్‌గా చొప్పదండి

రుక్మాపూర్‌లో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్

రూ. 200 కోట్లతో స్కూల్ ఏర్పాటు

రుక్మాపూర్‌లో నిర్మించతలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను 200 కోట్ల రూపాయలతో నిర్మించనున్నారు. స్కూల్ కోసం 25 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించారు. స్కూల్‌లో డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ బోర్డులు, ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. కంప్యూటర్ ల్యాబ్, అత్యాధునిక మౌలిక సదుపాయాలతో స్కూల్‌ను నిర్వహిస్తారు. నాణ్యమైన విద్యను అందించి ప్రపంచస్థాయిలో విద్యార్థులు పోటీ పడేలా తీర్చిదిద్దుతారు.

చొప్పదండి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషనల్ హబ్‌గా చొప్పదండి మారుతోంది. జిల్లా కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న రుక్మాపూర్ ప్రభుత్వ భూములలో మరో ప్రతిష్టాత్మకమైన విద్యాలయం ఏర్పాటు కానుంది. నియోజక వర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం చొప్పదండి మండలంలోనే ప్రతిపాదించగా ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుతుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే జవహర్ నవోదయ విద్యాలయం చొప్పదండిలో నెలకొనగా, రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ మొట్ట మొదటి సైనిక్ స్కూల్‌ను రుక్మాపూర్‌లోనే నెలకొల్పారు. తాజాగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం రుక్మాపూర్ ప్రభుత్వ భూములలో 25 ఎకరాలను కేటాయించారు.

సామాజిక సమైక్యతను పెంపొందించడమే లక్ష్యం

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. ప్రతి నియోజకవర్గానికి ఒక స్కూల్‌ను మంజూరు చేయగా, సామాజిక సమైక్యతను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. సమ్మిళిత విద్య, సమానత్వ సమాజాన్ని నిర్మించే ముఖ్య లక్ష్యాలతో స్కూల్‌ను రూపొందించారు. ఈ రెసిడెన్షియల్ పాఠశాలలో కుల, మత బేధం లేని వాతావరణం ఏర్పాటు చేసి ఆధునిక సౌకర్యాలతో సమగ్ర నాణ్యమైన విద్య అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించి ఏకీకృత విద్యార్థి సంఘాన్ని సృష్టించి సామాజిక విభజనలను తొలగించడం కోసమే ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

చొప్పదండి కేంద్రంగా విద్యాలయాలు

చొప్పదండిలో ఇప్పటికే నవోదయ విద్యాలయం, సాంఘిక సంక్షేమ సైనిక్ స్కూల్ ఉండడంతో తాజాగా అత్యుత్తమ స్కూల్‌గా అవతరించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ రావడంతో చొప్పదండి మండలం ఎడ్యుకేషనల్ హబ్‌గా మారనుంది. దేశ రక్షణ రంగాల్లో చేరేందుకు విద్యార్థులను తీర్చిదిద్దుతున్న సైనిక్ స్కూల్ ఉండగా, కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నడిచే జవహర్ నవోదయ విద్యాలయం చొప్పదండిలోనే ఉండడం విశేషం. మండలంలోని రుక్మాపూర్‌లో సైనిక్ స్కూల్, మోడల్ స్కూల్, కస్తూరిబా విద్యాలయాలు ఉండగా, ఇక్కడే యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు కానుండం విశేషం. రుక్మాపూర్‌లో నాలుగు ప్రతిష్టాత్మక ప్రభుత్వ విద్యాసంస్థలు ఏర్పాటు కావడం విశేషం.



చొప్పదండిలోని నవోదయ విద్యాలయం


రుక్మాపూర్‌లోని సైనిక్ స్కూల్

ఎస్‌యూలో ప్రశాంతంగా యూజీ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ 3,5వ సెమిస్టర్ పరీక్షలు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ మాట్లాడుతూ 5వ సెమిస్టర్ పరీక్షలకు 2,619 మంది విద్యార్థులకు 2,497 మంది హాజరైనట్లు తెలిపారు. నలుగురు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్లు పేర్కొన్నారు. మూడో సెమిస్టర్ పరీక్షలకు 10,991 మంది విద్యార్థులకు 10,579 మంది హాజరైనట్లు తెలిపారు. ఇద్దరు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్లు వెల్లడించారు.

ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్ష ఫీజు షెడ్యూల్

గణేశ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న విశ్వవిద్యాలయ, అనుబంధ కళాశాలలకు ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్ష ఫీజు షెడ్యూల్ గురువారం శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ విడుదల చేశారు. పరీక్షలు డిసెంబరులో ఉంటాయని పేర్కొన్నారు. డిసెంబరు 5వ తేదీలోగా పరీక్షలు చెల్లించాలని తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుముతో డిసెంబరు 9 వరకు అనుమతి ఉన్నట్లు పేర్కొన్నారు.

ఎస్సారెస్పీలోకి 1,338 క్యూసెక్కుల వరద

జగిత్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం 1,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది.ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.501 టీఎంసీలు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు


లీగ్ పోటీల్లో తలపడుతున్న హైదరాబాద్-మెదక్ జట్లు

ధర్మారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అండర్14 విభాగంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. మండలం లోని నందిమేడారం లోని బాలుర గురుకుల విద్యాలయంలో జరుగుతున్న ఈపోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి 10జిల్లాల నుంచి 240మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. 10 జిల్లాల జట్లను ఏ-పూల్ 5జట్లను, బీ-పూల్‌గా 5జట్లను విభజించారు. బుధవారం పోటీలు ప్రారంభం కాగా మొదటి రెండు రోజులు బాలబాలికల జట్ల మధ్య 40లీగ్ మ్యాచ్‌లు జరిగాయి. గురువారం జరిగిన లీగ్‌మ్యాచ్‌లో గెలుపొందిన టీమ్‌లు బాలుర విభాగం నుంచి 4టీమ్‌లు, బాలికల విభాగం నుంచి 4టీమ్‌లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. నేడు ఉదయం జరిగే సెమీఫైనల్ పోటీల్లో గెలుపొందిన జట్లు ఫైనల్‌కు చేరుకుంటుండగా మధ్యాహ్నం జరిగే ఫైనల్ మ్యాచ్‌లతో పోటీలు ముగియనున్నాయి.

భీమన్న సేవలో చేరిన ఎస్‌పీఎఫ్ పోలీసులు

- బందోబస్తు పరిశీలించిన కమాండెంట్ జంగయ్య

వేములవాడ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భీమేశ్వరాలయంలో ఎస్‌పీఎఫ్ భద్రతా సిబ్బంది విధుల్లో చేరింది. గురువారం ఆలయంలో భద్రతను ఎస్‌పిఎఫ్ కమాండెంట్ జంగయ్య, ఆలయ ఈవో రమాదేవి పరిశీలించారు. అనంతరం కమాండెంట్, ఇవోలు భద్రతా సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇద్దరు హెడ్‌కానిస్టేబుల్స్, 10మంది కానిస్టేబుళ్లకు భీమన్న సన్నిధిలో విధులు కేటాయించామన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం కొత్తగా విధుల్లో చేరిన భద్రతా సిబ్బంది స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు డి.తిరుపతిరెడ్డి, మహేందర్, ఆలయ పర్యవేక్షకులు రాజేందర్, గొట్టం గిరిలు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ ఉద్యోగులకు బయోమెట్రిక్ అమలు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఉద్యోగులకు బయోమెట్రిక్ అమల్లోకి తీసుకువచ్చారు. గురువారం భీమేశ్వర సదన్‌లోని ఈవో కార్యాలయంలో నెలకొల్పిన బయోమెట్రిక్ విధానంలో హాజరును ఈవో రమాదేవి పరిశీలించారు. ఆలయంలో దాదాపు 150మంది మినిస్ట్రీరియల్, నాలుగో తరగతి ఉద్యోగులు, మరో 20 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, 150మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తారు. ఇకనుంచి రాజరాజేశ్వ రాలయం, భీమేశ్వరాలయంలో పనిచేసే ఉద్యోగులందరికి బయోమెట్రిక్ యంత్రం ద్వారా హాజరు చేసుకునే పద్ధతి అమలులోకి తీసుకువచ్చారు.



విధుల్లో చేరిన ఎస్‌పీఎఎఫ్ భద్రతా సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఈవో రమాదేవి, బయోమెట్రిక్ విధానాన్ని పరిశీలిస్తున్న ఈవో

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు అప్పన్నపేట విద్యార్థి ఎంపిక



అశ్వితను అభినందిస్తున్న హెచ్‌ఎం పురుషోత్తం

పెద్దపల్లి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో ఎంపికకి మండలంలోని అప్పన్నపేట జిల్లా పరిషత్‌పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పంబాల అశ్విత ఎంపికైనట్లు పీడీ సురేందర్ తెలిపారు. ఈసందర్భంగా గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఈనెల 28నుంచి 30 వరకు జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్స్ ఖోఖో పోటీలలో అశ్విత పాల్గొంటున్నట్లు తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి రూ. ఐదు వేల కోట్లు కేటాయించాలి


మాట్లాడుతున్న మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలక్రిష్ణ

సుభాష్‌నగర్/భగత్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో ఐదు వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలక్రిష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని రెవెన్యూ గార్డెన్‌లో తెలంగాణ మత్స్య కార్మికుల నాలుగో రాష్ట్ర మహాసభ, ముకుందలాల్ మిశ్రా భవన్‌లో రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మత్స్య సొసైటీకి పది లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నేటికి మత్స్య వృత్తిపై ఆధారపడి కుటుంబాలు ఉపాధి పొందుతున్నా యన్నారు. రాష్ట్రంలో సుమారు 5,500 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో ఐదు లక్షల 60 వేల మంది మత్స్య సహకార సంఘాల సభ్యులుగా ఉన్నార న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ మాఫియా పెద్ద ఎత్తున చెరువులు కుంటలు జల వనరుల ఉనదీ పరి వాహక ప్రాంతాల భూములను కబ్జాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూములను శాటిలైట్ ద్వారా సర్వే చేయించి హద్దులు తీయించి ఫెన్సింగ్ వే యాలన్నారు. జనవనరులను కబ్జాలు కాలుష్యం నుంచి విముక్తి కల్పించి మత్స్య వృత్తిని కాపాడాలన్నారు. గత ప్రభుత్వంలో చేప, రొయ్య పిల్లల పంపిణీలో భారీ అవినీతి జరిగిందని విమర్శించారు.

మత్స్యకార సొసైటీ అకౌంట్‌లో నగదు జమ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీడీసీ రుణాలు నిలిపివేసిందని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌సీడీ రుణాలను మత్స్య సహకార సంఘాలకు నేరుగా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సంక్షేమ ఫలితాలను పారదర్శకతతో అవినీతి లేకుండా అమలు చేయాలని కోరారు. 33 జిల్లాల మత్స్య సహకార సంఘాల ఎన్నికలు నిర్వ హించాలని, డిమాండ్ చేశారు. సమావే శంలో రాష్ట్ర అధ్యక్షుడు గొరింకల నరసిం హ, ఉపాధ్యక్షుడు పగడాల నాగేశ్వరరావు, దీటి శ్రీనివాసరావు, గాండ్ల అమరావతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి గొడుగు వెంకట్, భక్కి బాలమణి, చంద్రి పుష్ప, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిట్టల వెంకటేష్, జునగరి గణేష్, కోశాధికారి పప్పు సదానంద, నగర అధ్యక్ష, కార్యదర్శులు మద్రి శశికళ, నాగుల అరుణ తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ...

ఈ సందర్భంగా తెలంగాణ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గోరెంకల నర్సింహా, లెల్లెల బాలకృష్ణ, 19 మంది ఆఫీస్ బేరర్స్, 51 మంది రాష్ట్ర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

నాడు ఎన్నికలకు దూరం.. నేడు సై..

- తీరిన గొల్లపల్లి వాసుల సమస్య..
- ఎన్నికలకు సిద్ధం అవుతున్న ప్రజలు
- ఏడు సంవత్సరాలుగా ప్రత్యేకాధికారుల పాలన


గొల్లపల్లి గ్రామం

ఇల్లంతకుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అధికారులు చేసిన పొరపాటు వల్ల ఆగ్రామపంచాయితీకి పాలకవర్గం లేకుండా పోయింది. ఇల్లంతకుంట మండలంలోని గొల్లపల్లి గ్రామపంచాయతీని ప్రభుత్వం రెండు గ్రామపంచాయతీలుగా మార్చింది. వెంకట్రావుపల్లె, గొల్లపల్లి గ్రామపంచాయితీలుగా ఆవిర్భావం చెందాయి. అప్పటి అధికారులు గొల్లపల్లికి చెందిన 150మంది ఓటర్లతో పాటు ఇళ్లు, వ్యవసాయ భూములను వెంకట్రావుపల్లె పరిధిలోకి వచ్చేలా చేశారు. దీనిపై గొల్లపల్లి గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. 2019 జనవరిలో ఎన్నికల సంఘం గ్రామపంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చారు. గొల్లపల్లి గ్రామపంచాయతీని బీసీకి కేటాయించారు. తమ ఓటర్లను తమ గ్రామపంచాయతీలో కలిపితేనే ఎన్నికలకు వెళతామని గొల్లపల్లి గ్రామస్థులు పట్టుబట్టారు. దీనితో సర్పంచ్, వార్డుస్థానాలకు ఎవరు నామినేషన్లు వేయలేదు. ఎన్నికలు జరగకుండా పోయాయి. అనంతరం ఫిబ్రవరిలో మరోసారి గొల్లపల్లి గ్రామపంచాయతీకి ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు. జిల్లాస్థాయి అధికారులు గ్రామానికి చేరుకొని నచ్చజెప్పారు. సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కొంతమంది చేత నామినేషన్లు వేసేలా ప్రోత్సహించారు. నామినేషన్ల ఉపసంహరణ రోజు మరోసారి ఏకమైన గ్రామస్థులు అందరు ఉపసంహరించుకున్నారు. అప్పటినుంచి ప్రత్యేకాధికారుల పాలనలో గొల్లపల్లి గ్రామపంచాయతీ కొనసాగింది.

ఓటర్లను గ్రామంలో కలపడంతో..

చివరకు ప్రభుత్వం గ్రామానికి చెందిన ఓటర్లను తిరిగి గొల్లపల్లి గ్రామపంచాయతీలో కలిపారు. దీనితో ఈసారి ఎన్నికలకు గొల్లపల్లి గ్రామపంచాయతీ సిద్ధం అవుతోంది. గొల్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో చింతలకుంటపల్లె గ్రామం కూడా వస్తుంది. గ్రామపంచాయతీలో ప్రస్తుతం 324మంది పురుష, 298మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 622మంది ఓటర్లు ఉన్న గొల్లపల్లి గ్రామపంచాయతీని ప్రస్తుతం ఎస్సీ మహిళకు కేటాయించారు. ఈనెల 14న జరిగే ఎన్నికల బరిలో నిలిచేందుకు గ్రామస్థులు సిద్ధం అవుతున్నారు. తమ సమస్య పరిష్కారం కావడంతో ఎన్నికలకు వెళ్తున్నామని పేర్కొంటున్నారు.

రుద్రంగి మండలంలో... నాలుగు సర్పంచ్ పదవులు ఏకగ్రీవం


వీరునితండాలో సంబరాలు జరుపుకుంటున్న గ్రామస్థులు

రుద్రంగి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండలంలో ఇప్పటివరకు నాలుగు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. గ్రామపంచాయతీ సర్పంచ్‌ల, వార్డుసభ్యులు నామినేషన్ల ప్రక్రియ జరుగుతోంది. గురువా రం ముగ్గురు సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారు. మండలంలోని గైదిగుట్ట తండా గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఇస్లావత్ కిషన్, వీరునితండా సర్పంచ్‌గా గుగులోత్ మంజుల, చింతమణితండా సర్పంచ్‌గా గుగులోత్ సిందూజ ఏకగ్రీవం అయ్యారు. రూప్లానాయక్ తండా సర్పంచ్‌గా భూక్య జవహర్‌లాల్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధికారులు అధికారికంగా ప్రకటించవలసి ఉంది.

వాలీబాల్ పోటీల ఏర్పాట్లు పరిశీలన

సిరిసిల్ల టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల వాలీబాల్ పోటీల ఏర్పాట్లను కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గిన్నె లక్ష్మణ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో బాలురు 10 జట్లు, బాలికలు 10 జట్లు పాల్గొంటాయన్నారు. ఈ నెల 30 నుంచి డిసెంబరు 3 వరకు ఈ క్రీడలు జరుగుతాయని తెలిపారు. క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అజ్మీరా రాందాస్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షు డు శ్రీకుమార్, ఉపాధ్యక్షుడు చింతకింది శ్యాం, కోశాధికారి కోడం శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి లక్ష్మణ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, వాలీబాల్ అకాడమి కోచ్‌లు పాల్గొన్నారు.


వాలీబాల్ కోర్టును పరిశీలిస్తున్న లక్ష్మణ్ , సభ్యులు

నామినేషన్ల పర్వం షురూ

(5వ పేజీ తరువాయి)

వరకు అవకాశముంటుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు.

● గ్రామాల్లో వేడెక్కుతున్న రాజకీయం

గ్రామపంచాయతీల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అన్ని గ్రామాల్లోనూ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. పార్టీల గుర్తులేకుండా ఎన్నికలు జరుగుతున్నా అన్ని రాజకీయపార్టీల వారు తమ పార్టీకి చెందిన వారిని సర్పంచులుగా, వార్డుసభ్యులుగా గెలిపించుకునేందుకు వ్యూహరచన చేస్తున్నారు. పార్టీ కార్యక్రమాలను పల్లెపల్లెకు తీసుకెళ్లేందుకు వీలుకలుగుతుందనే భావనతో అన్ని రాజకీయపక్షాలు తమ మద్దతుదారులను గెలిపించుకోవడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నాయి. సర్పంచు పదవులకు, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేసేందుకు ఆసక్తిచూపిస్తున్న వారితో సమావేశాలు నిర్వహించి పార్టీలో సభ్యుల మధ్య పోటీ ఉండకూడదని, పార్టీ నుంచి ఒకరిని మాత్రమే రంగంలోకి దించేందుకు వ్యూహరచన చేస్తున్నారు. ఎమ్మెల్యేలు తమ పార్టీ వారిని ముఖ్యంగా తమ మద్దతుదారులను తెరపైకి తెస్తున్నారు. ఆశావహుల్లో అవగాహన కుదరక ముందైతే నామినేషన్లు వేస్తున్నారు. తర్వాత పార్టీ స్థాయిలో కూర్చొండి చర్చించుకొని అవగాహనకు వచ్చే అవకాశమున్నట్లు చెబుతున్నారు. అన్ని పార్టీల్లోనూ పోటీ చేయాలనుకుంటున్నవారు ఎమ్మెల్యేలను, పార్టీ పెద్దలను కలుస్తూ మద్దతు కోరుతున్నారు.

30న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై బీసీల ధర్మ యుద్ధభేరి

గణేశ్‌నగర్,నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 రిజర్వేషన్లు సాధనే లక్ష్యంగా ఈ నెల 30న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై బీసీల ధర్మ యుద్ధభేరి నిర్వహించనున్నామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ తెలిపారు. రాష్ట్రంలో రెడ్ల రాజ్యం నడుస్తోందని, బీసీలను రాజకీయంగా భూస్థాపితం చేయాలని అగ్రకుల పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఇందిరాపార్క్‌ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన యుద్ధభేరిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎస్‌యూ వీసీకి శుభాకాంక్షలు

గణేశ్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయం తెలుగు విభాగంలో పీహెచ్‌డీ అవకాశం కల్పించినందుకు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్‌కు ప్రొఫెసర్లు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. యూనివర్సిటీ స్టూడెంట్ లీడర్ జేఏసీ చైర్మన్ చెన్నమల్ల చైతన్య, తెలుగు విభాగం ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీ నారాయణ, డాక్టర్ పావని, స్వరాజ్యం, కుందేటి సత్యనారాయణ, బోడకుంట రమేష్, శనిగరం అరుణ్ పాల్గొన్నారు.

29న జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు

కరీంనగర్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆరో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 29న కరీంనగర్ కోట ఇన్స్టిట్యూట్‌లో వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించనున్నట్లు ప్రజ్ఞ వికాస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించే వ్యాసరచన, వకృత్వం పోటీలకు ఒక పాఠశాల నుంచి మొత్తంగా నలుగురు విద్యార్థులకు మాత్రమే అవకాశముంటుందన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 1, 2 ర్యాంకులు సాధించిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రెడ్డి సంక్షేమానికి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి వెంటనే నిధులు కేటాయించి పాలకవర్గాన్ని నియమించాలని జిల్లాకు చెందిన రెడ్డి ఐక్య వేదిక నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రెడ్డి ఐక్య వేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించేందుకు వెళ్లగా రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డితో సహా ముఖ్యనాయకులందరిని పోలీసులు అరెస్టు చేశారు. రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నంది తిరుపతిరెడ్డి, రాష్ట్ర నాయకులు బండగోపాల్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు వంచ సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

కల్యాడపు ఆగయ్య మృతి తీరనిలోటు

కరీంనగర్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వీరాభిమాని, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కల్యాడపు ఆగయ్య మృతి పార్టీకి తీరనిలోటని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. గురువారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కల్యాడపు ఆగయ్య దశదినకర్మ కార్యక్రమంలో కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ ఆయన కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని ప్రకటించారు. పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ వంచ శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు. పార్టీ ముఖ్య నాయకులు ఆవునూరి దయాకర్‌రావు, దామెర సత్యం, రొడ్డ శ్రీనివాస్, రవీందర్, తీగుట్ల రమేశ్‌కుమార్, శ్రీధర్, కాంతయ్య, రైతు ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు ామారావు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వం నిధులతోనే గ్రామాల అభివృద్ధి

మానకొండూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడ గుగ్గిల్లపు రమేశ్ అన్నారు. మానకొండూర్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతోనే గ్రామాలు అభివృద్ధి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు రంగు బాస్కరాచారి, మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి ఉన్నారు.

చెక్‌డ్యామ్‌ను ఇసుక మాఫియానే పేల్చేసింది

జమ్మికుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం తనుగుల పరిధిలోని చెక్‌డ్యామ్‌ను ఇసుక మాఫియానే పేల్చేసిందని మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిలి రమేష్ అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాసిరకం పనులతో చెక్‌డ్యామ్ ధ్వంసమైందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ మాట్లాడడంలో అవగాహన లోపం కనిపిస్తోందన్నారు. చెక్‌డ్యామ్ పేల్చారని సంబంధిత అధికారులు పెద్దపల్లి జిల్లా పోలీస్‌లకు ఫిర్యాదు చేశారని, కాంగ్రెస్ నాయకులకు కనీసం స్పృహ లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. చెక్‌డ్యామ్ పేల్చినట్లు తమ దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. సొసైటీ చైర్మన్ సంపత్, రాజ్‌కుమార్, దిలీప్, సదానందం పాల్గొన్నారు.

బోగస్ ప్రచారాలు మానుకోవాలి

జమ్మికుంట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇప్పటికైన బోగస్ ప్రచారాలు మానుకోవాలని కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు అన్నారు. గురువారం జమ్మికుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అడ్డూఅదుపు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసింది గుర్తు లేదా అన్నారు. మరో మూడు, నాలుగు రోజుల్లో ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ వస్తుందని, దాని ఆధారంగా బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. పీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు దేశిని కోటి అరుకాల వీరేశలింగం, గూడెపు సారంగపాణి, పొనగంటి మల్లయ్య పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

శంకరపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎన్నికల నియమావళిని పాటించాలని హుజూ రాబాద్ ఏసీపీ మాధవి అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్‌తో కలిసి మండ లంలోని తాడికల్, ఎరడపల్లి, అర్కం డ్ల, మక్త, కేశవపట్నం, కరీంపేట, ఇప్పలపల్లి, అంబాలపూర్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఏసీపీ వెంట ఎస్సై శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో ప్రజలకు మోడల్ కోడ్ కండక్ట్‌పై ఎస్సై తిరుపతి అవగాహన కల్పించారు.

జాగృతిలో చేరికలు

సైదాపూర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఘన్‌పూర్‌లో నాయకులు, మహిళలు జాగృతిలో చేరినట్లు జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు. గురువారం వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. జాగృతిలో చేరినవారిలో స్వరూప, సంగీత, పద్మ, విజయ, రమ్య లావణ్య శాంతవ్వ, లక్ష్మి, కుమారస్వామి, తిరుపతి, లత, మజూల ఉన్నారు.

రాజీవ్ యువ వికాసం కోసం ఎదురు చూపులు

- ఐదు నెలలుగా వీడని సందిగ్ధం



కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయం

కరీంనగర్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వం ఆదేశాల మేరకు దరఖాస్తు చేసుకొని ఐదు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం లేదు. రాయితీ రుణాలతో స్వయం ఉపాధి పొందుదామనుకున్న యువత ఆశలు ఆవిరవుతున్నాయి. వాస్తవానికి రాష్ట్ర అవవతరణ దినోత్సవం జూన్ 2న అర్హులకు మంజూరు పత్రాలు పంపిణీ చేయాల్సి ఉంది. అఖరి క్షణాల్లో ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. రుణాల పంపిణీపై సందిగ్ధం నెలకొనడంతో దరఖాస్తుదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ సామాజిక వర్గాల ద్వారా వ్యాపారాలు పెట్టుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో రాయితీ రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో కరీంనగర్ రూరల్ మం డలంలో ఆయా ఐదు నెలల కిందనే రాజీవ్ యువ వికాసం కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగుల నుంచి అర్హుల జాబితాను అధికారులు రూపొందించారు. సోమవారం కరీంనగర్ మండలంలో 50 యూనిట్లకు మంజూరు పత్రాలను అందజేయాలి కాని అందజేయలేక పోవడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. కరీంనగర్ మండలంలో రాజీవ్ యువ వికాసం పథకం కోసం లబ్ధిదారులు 1106 మంది దరఖాస్తు చేసుకున్నారు. 219 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో 50వేల రుణాల కోసం 70 మంది. లక్షలోపు 65 మంది. 2లక్షల లోపు 61 మంది2లక్షల నుంచి 4లక్షల వరకు 23 మంది దరఖాస్తుదారులను అధికారులు ఎంపిక చేశారు. సబంధిత అధికారులకు పంపిం చారు. ఇప్పటి వరకు రుణాలు రాక పోవడంతో లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. సిబిల్ స్కోర్ ఆధారంగా ఎంపిక చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. సర్కారు పథకం అమలుపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకపోవడంతో జాబితా ఎంపిక నిలిచిపోయింది. ప్రభుత్వం యువతకు చేయూతనందిం చేందుకు రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయాలని, నిరు ద్యోగులకు స్వయం ఉపాధి కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

శిశుగృహ, బాలసదనం నుంచి పిల్లల దత్తత

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శిశు గృహలో పెరుగుతున్న నాలుగు నెలల వయస్సు ఉన్న ఆడ శిశువును హుస్నాబాద్‌కు చెందిన, బాల సదనంలో ఆశ్రయం పొందుతున్న 13 సంవత్సరాల బాలికను తమిళనాడుకు చెందిన పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకున్నారు. గురువారం జిల్లా యువజన క్రీడా శాఖ కార్యాలయంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ పమేలా సత్పతి పిల్లలను దత్తత ఇచ్చారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, డీసీపీవో పర్వీన్ పాల్గొన్నారు.

టీఎన్‌జీవో కార్యక్రమం అభినందనీయం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

సుభాష్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల కోసం టీఎన్‌జీవో చేపట్టిన ఆరోగ్య మహిళా కార్యక్రమం అభినందనీయమని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. గురువారం స్థానిక టీఎన్‌జీవో ఫంక్షన్‌హాలులో నిర్వహించిన ప్రత్యేక ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీఎన్‌జీవో సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ ఆదర్శనీయమన్నారు. టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్‌గౌడ్, కోశాధికారి కిరణ్ కుమార్‌రెడ్డి, జిల్లా సహాధ్యక్షుడు ఒంటెల రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, ప్రోగ్రాం ఆఫీసర్ ఉమాశ్రీ, సనాజవేరియా, టీఎన్‌జీవో పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్, మహిళ జేఏసీ నాయకురాళ్లు ఇరుమల్ల శారద, సునీత, సరిత, విజయలక్ష్మి, లలితమేరి, రమణ, స్వరూప, లక్ష్మి, భాగ్యలక్ష్మి, ఊర్మిళ, అస్గర్ అలీ, వాస్వవిక్‌గౌడ్, కొమ్మెర శ్రీనివాస్‌రెడ్డి, లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న చైర్మన్ పాతిమారెడ్డి

భగత్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కి సెయింట్ జార్జ్ (సీబీఎస్ఈ) విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.పాతిమారెడ్డి అభినందించారు. పాఠశాలకు చెందిన రామ్‌చరణ్, విశాల్, విశాల్ చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కి ఎంపిక య్యారన్నారు. ఈ నెల 28న కరీంనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

చెక్ పోస్టుల ఏర్పాటు



మొగ్దుంపూర్ చెక్ పోస్టు వద్ద అధికారులు

కరీంనగర్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ జిల్లా సరిహద్దు మొగ్దుంపూర్ ప్రధాన రాజీవ్ రహదారిలో గురువారం చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. పెద్దపల్లి జిల్లా నుంచి కరీంనగర్ జిల్లాకు వచ్చే వాహనాలను తనిఖీ చేసేందుకు పోలీస్, పంచాయతీ, రెవెన్యూ అధికారులతో బృందాలను నియమించారు. ఎంపీడీవో సంజీవరావు, రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి చెక్‌పోస్టును పరిశీలించారు.

తిమ్మాపూర్: మండలంలోని రేణికుంట రాజీవ్ రహదారిపై గురువారం ఎల్ఎండీ పోలీసుల ఆధ్వర్యంలో చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సీఐ సదన్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం సీఐ సదన్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యే వరకు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు కొనసాగుతాయన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంగించే విధంగా డబ్బు, మద్యం, బంగారం వంటి వస్తువులు రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్సై అన్వర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్తంగా..

గంగాధర: గంగాధర మండలంలోని కురిక్యాలలో సీపీ గౌస్ ఆలం ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. సీఐ ప్రదీప్‌కుమార్, ఎంపీడీవో రాము, ఎస్సై వంశీకృష్ణ ఉన్నారు.

కరీంనగర్ టౌన్: భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం శాతవాహన యూనివర్శిటీ అధ్యక్షుడిగా తిప్పనిపల్లి ప్రకాశ్‌ను నియమించినట్లు యూనివర్శిటీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలం నూతన గ్రామ పాలనాధికారుల కమిటీ నియామకం గురువారం చేపట్టారు. కమిటీ అధ్యక్షుడిగా ఎండీ జాఫర్, ప్రధాన కార్యదర్శిగా రామారావు, ఉపాధ్యక్షుడిగా నరేష్, కోశాధికారిగా శ్రీనివాస్, ఆర్గనైజర్‌గా భాస్కర్‌ను నియమించారు.

హుజూరాబాద్: పట్టణంలో ప్రపంచ పైల్స్ దినోత్సవాన్ని గురువారం వైద్యులు కూరపాటి రమేష్, రామలింగారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ తీశారు. వాకర్స్ అసోసి యేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్, వేల్పుల రత్నం, రవీందర్, సారయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వీణవంక:మండల కేంద్రానికి చెందిన గూలం రిజ్వాన్ 108 అంబులెన్స్ డ్రైవర్ గుండె పోటుతో మరణించగా కుటుంబ సభ్యులకు 108 సంస్థ ఆధ్వర్యంలో ఐదు లక్షల రుపాయల ఇస్యూరెన్స్ చెక్కును తెంగాణ హెడ్ సుధాకర్, హెచ్ఆర్ కిరణ్ అందజేశారు. జిల్లా మేనేజర్ జనార్దన్, ఓపీ మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

సైదాపూర్: సైదాపూర్ మండలంలోని సోమారం తెలంగాణ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. హెడ్ బాయ్‌గా సిద్ధు, హెడ్ గర్ల్‌గా అఖిల, డిప్యూటీ హెడ్ బాయ్‌గా లోకేశ్, డిప్యూటీ హెడ్ గర్ల్‌గా లోకేశ్వరి, స్పోర్ట్స్ కెప్టెన్‌గా బన్నీ గెలుపొందినట్లు ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ తెలిపారు.

శంకరపట్నం: శంకరపట్నం మోడల్ స్కూల్ విద్యార్థులకు యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ కుమార్, ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం



తిమ్మాపూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయం

తిమ్మాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల నెల 25న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. తిమ్మాపూర్ మండలంలో డిసెంబరు 14న రెండవ విడతలో ఎన్నికలు జరగనున్నాయి. దీంతో సంబందిత అధికారులు ఎన్నికలు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలు నిర్వహించేందుకు కావల్సిన సామగ్రి స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి చేరుకుంటున్నాయి. ప్రస్తుతానికి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్న ఎన్నికల సామగ్రిలో నామినేషన్, కౌంటింగ్ పత్రాలు, పోలీంగ్ కవర్లు, అభ్యర్థుల (నియామవళి) చేతి పుస్తకాలు, పాస్‌లు, బ్యాడ్జిలను పోలింగ్ బూత్‌ల వారిగా సిద్ధం చేస్తున్నారు. తిమ్మాపూర్ మండలంలో 23 గ్రామ పంచాయతీలు, 212 వార్డులు ఉన్నాయి. డిసెంబరు 14వ తేదీ ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్లు నవంబరు 30వ తేదీ నుంచి ప్రారంభమై డిసెంబరు 2 సాయంత్రం 5గంటల వరకు సాగనున్నాయి.

నామినేషన్ సెంటర్ల పరిశీలన

కరీంనగర్ రూరల్: సర్పంచ్ ఎన్నికల సందర్భంగా పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను గురువారం జిల్లా ఎన్నికల అబ్జర్వర్ చంద్రశేఖర్ సందర్శించారు. చామనపల్లి, మొగ్దుంపూర్, చెర్లబూత్కూర్‌లో నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. డీఎల్‌పీవో హరికిషన్, పంచాయతీ కార్యదర్శి మహేంద్ర తదితరులు ఉన్నారు.

సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు

కరీంనగర్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) కరీంనగర్ రూరల్ మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి రోజు నామినేషన్ల స్వీకరించారు. నగునూర్, చామనపల్లి, చెర్లబూత్కూర్, చేగుర్తి, మొగ్దుంపూర్‌లో నామినేషన్ల కేంద్రాలను ఏర్పాటు చేశారు. సర్పంచ్‌స్థానానికి నగునూర్‌లో సాయిల్ల శ్రావణి, పెంచాల సునీత, నర్సింగోజు అన్నపూర్ణ, చామనపల్లిలో బీజేపీ యువమోర్చా రాష్ట్ర నాయకుడు మునిగంటి కుమార్, మరో ఆరుగురు నామినేషన్లు, వార్డు సభ్యులు 9నామినేషన్లు దాఖలు చేశారు. సీపీ గౌస్ ఆలం, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఎంపీ డీవో సంజీవరావు, కార్యదర్శులు ఉన్నారు.

చొప్పదండి: మండలంలో తొలిరోజు 15 నామినేషన్లు దాఖలయ్యాయి. తొలిరోజు 8 గ్రామ పంచాయతీలలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఆర్నకొండలో 6, మంగళపల్లి 3, రాగంపేట 1, పెద్దకుర్మపల్లి 1, కోనేరుపల్లి 1, గుమ్లాపూర్‌లో 1, కాట్నపలి 1, చాకుంట 1 నామినేషన్ వేశారు. వివిధ పంచాయతీల్లో 12వార్డులకు నామినేషన్లు దాఖలు చేశారు. రుక్మాపూర్ 1, చాకుంట 2, కొలిమికుంట 1, కాట్నపల్లి 1, వెదురుగట్ట 1, ఆర్నకొండ 5, మంగళపల్లి 1 నామినేషన్లు దాఖలయ్యాయి.

● రామడుగు మండలంలో సర్పంచ్ స్థానాలకు 27, వార్డు స్థానాలకు 12 నామినేషన్లు దాఖలయ్యాయి. సర్పంచ్ స్థానాలకు కొరటపల్లి 4, మోతె 2, గోపాల్‌రావుపేట 4, గుండి 2, వన్నారం 1, వెంకట్రావుపల్లి 1, తిర్మలాపూర్ 1, షానగర్ 3, పందికుంటపల్లి 1, కిష్టాపూర్ 1, రంగసాయిపల్లి 1, దత్తోజిపేట 2, వెదిర 1, వెలిచాలలో 2 నామినేషన్లు దాఖలయ్యాయి.

భగత్‌నగర్: కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో సర్పంచులకు 2, వార్డులకు 7, బద్దిపల్లిలో సర్పంచులకు 1, వార్డులకు 1, ఎలగందల్‌లో సర్పంచులకు 4, వార్డులకు 6, కమాన్‌పూర్‌లో సర్పంచులకు 3, వార్డులకు 6, ఖాజీపూర్‌లో సర్పంచులకు 1, వార్డులకు 1, నాగులమల్యాలలో సర్పం చులకు ఒకటి చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. మండలంలో సర్పంచులకు 12,వార్డులకు 21 నామినేషన్‌లు దాఖలయ్యాయి.

గంగాధర:మండలంలో మొదటి రోజు 28 సర్పంచ్, 32 వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. ఆచంపల్లిలో సర్పంచ్ స్థానానికి 2, వార్డులకు 3, బూరుగుపల్లి సర్పంచ్ 3, వార్డుకు ఒకటి, నర్సింహులపల్లి 3 సర్పంచ్, 3 వారు, గంగాదరలో సర్పంచ్ 1, వారు 3, లక్ష్మీదేవిపల్లిలో 2 సర్పంచ్, మధురానగర్‌లో 2 సర్పంచ్, 6 వార్డుకు, చర్లపల్లి(ఎన్)లో సర్పంచ్‌కు ఒక్కటి, ర్యాలపల్లిలో సర్పంచ్, వార్డుకు ఒక్కొక్కటి, కొండయ్యపల్లిలో 2 సర్పంచ్‌కు, ఒక్కటి వార్డుకు, కాచిరెడ్డిపల్లిలో ఒకటి సర్పంచ్‌కు, ఒకటి వార్డుకు, కొండన్నపల్లిలో 2 సర్పంచ్‌కు, 2 వార్డుకు, గర్షకుర్తిలో 2 సర్పంచ్‌కు, 8వార్డుకు, మల్లాపూర్‌లో సర్పంచ్ 1, గోపాల్‌రావుపల్లిలో 2 సర్పంచ్‌కు, ఒకటి వార్డు, కాసారంలో ఒకటి సర్పంచ్‌కు, గట్టుబూత్కూర్‌లో ఒకటి సర్పంచ్, 2వార్డు సభ్యులకు హిమ్మత్ నగర్‌లో సర్పంచ్ స్థానానికి దరఖాస్తు దాఖలైనట్లు అధికారులు తెలిపారు.

సృజనాత్మకతకు మారుపేరు కరీంనగర్ జిల్లా



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శ్రీరాంమొండయ్య

భగత్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా సృజనాత్మకతకు మారుపేరని డీఈవో శ్రీరాం మొండయ్య అన్నారు. గురువారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల ఆవిష్కరణలు జపాన్‌కు సైతం ఎంపిక అవుతున్నట్లు చెప్పారు. కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లా బాలవైజ్ఞానిక ప్రదర్శన, జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శను అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 29, 30, డిసెంబరు 1వ తేదీన నిర్వహించే జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు. అనంతరం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని అల్ఫోర్స్‌లో నిర్వహించేందుకు అవకాశం కల్పించిన కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎంఈవో ఆనందం, డీసీఈబీ కార్యదర్శి భగవంతరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అప్పులపాలైన మున్సిపల్ కార్పొరేషన్

కరీంనగర్ అర్బన్, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): బీఆర్ఎస్ హయాంలోనే కరీం నగర్ మున్సిపల్ కార్పొ రేషన్ అప్పుల పాలైందని కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. మాజీ మేయర్, బీజేపీ నాయకుడు సునీల్‌రావు చేపడుతున్న సంతకాల సేకరణను ప్రజలు విశ్వసించరన్నారు. బీఆర్ఎస్ పాలనలో కమీషన్లు దండుకొని, అవినీతికి పాల్పడ్డారన్నారు. అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి, దోచుకున్న సొమ్మును దాచుకోవడానికి మాజీ మేయర్ సునీల్‌రావు బీజేపీలో చేరారని ఆరోపించారు.

3వ ప్రపంచ తెలుగు మహాసభల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రసారస్వత పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభల ఆహ్వాన పత్రిక పోస్టర్‌ను గురువారం భవానీ సాహిత్య వేదిక సంస్థ కార్యాలయంలో అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ ఆవిష్కరించారు. సత్యసాయి స్పిర్చువల్ సిటీ, సాయి బొమ్మిడాలనగర్ హైవే గుంటూరు అమరావతిలో జనవరి 3, 4, 5 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు హాజరయ్యేవారు పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని కోరారు. 9014559059 నంబరులో సంప్రదించాలని సూచించారు.

చెక్ డ్యామ్ ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలంలో చెక్ డ్యామ్ ధ్వంసం చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గురువారం హుజూరాబాద్‌లో మాట్లాడుతూ చెక్ డ్యామ్ ధ్వంసం చేసిన వారికి కాంగ్రెస్ మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు ఇంగ్లీష్ ఒలింపియాడ్ పోటీలు



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు

కరీంనగర్ రూరల్/ తిమ్మాపూర్ నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎల్టాస్ తెలంగాణ ఇంగ్లీష్ ఒలింపియాడ్ అండ్ ఎడ్యుక్వెస్ట్ టాక్ మండల స్థాయి పోటీలు నిర్వహించారు. విద్యార్థులు అక్షయ, మధు ప్రియ, జోష్నాషానాజ్, వైష్ణవి, స్ట్రీమ్ - 2 విభాగంలో మౌక్షిని, మధిహ ఫాతిమా, మీనాక్షి, వైష్ణవి సత్తాచాటారు.

కరీంనగర్ రూరల్ మండలంలో జూనియర్ విభాగంలో చెర్లబూత్కూర్ యూపీఎస్‌కు చెందిన బి.అక్షయ, సీనియర్ విభాగంలో నగునూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కె.వంశీ చందన, మొగ్దుంపూర్ జిల్లా పరిషత్‌కు చెందిన టి.లక్ష్మీ ప్రసన్న, నగునూర్ జిల్లా పరిషత్ స్కూల్ ఫౌజియా నిషాత్ జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.

ఇల్లందకుంట : జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు పెన్ పేపర్ కాంపిటిషన్ రాత పరీక్ష, ఎలోకేషన్ ఉపన్యాస పోటీలు నిర్వహిచారు. రాత పరీక్షలో రాజేష్, ఉపన్యాస పోటీల్లో రచన ఎంపికయ్యారు.

చొప్పదండి: ఒలింపియాడ్ సీనియర్ విభాగంలో చొప్పదండి బాలుర పాఠశాల విద్యార్థి ఖైరునిస, జూనియర్స్ విభాగంలో చొప్పదండి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి సహస్ర, చాకుంట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి దివ్య, సీనియర్స్ విభాగంలో రాగంపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రియ దర్శిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

గన్నేరువరం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గన్నేరువరం, జంగపల్లి హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించారు.

వీణవంక: మండలంలో సీనియర్ ఒలింపియాడ్ ఎస్.హరిప్రియ చల్లూరు, జూనియర్ ఒలింపియాడ్ కె.భవన చరిత చల్లూరు, ఉపాన్యాస పోటీల్లో విష్ణు, సంహిత, కేజీబీవీ మోడల్ స్కూల్‌లో ఒలింపియాడ్ అక్ష యాత, అన్విత, ఉపాన్యాస పోటీలలో హన్సిత, కార్తీక విజేతలుగా నిలిచారు.

హుజూరాబాద్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విజేతలకు విద్యార్థులకు ఎంఈవో శ్రీనివాస్ ప్రశంస పత్రాలను అందజేశారు.

సైదాపూర్: వెన్కేపల్లిలో విజేతలకు ఎంఈవో కట్ట రవీంద్రచారీ సర్టిఫికెట్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు దేవేందర్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఎల్లా కన్వీనర్ కవిత పాల్గొన్నారు.